క్లుప్తంగా

మత సామరస్యానికి ప్రతీక రంజాన్



ముస్లింలతో ఎమ్మెల్యే వాసుబాబు, సుబ్బరాజు

గణపవరం: మతసామరస్యానికి ప్రతీక రంజాన్ పర్వదినమని అన్నిమతాలు సామరస్యంగా మెలగాలని, ప్రతి ఒక్కరూ ఇతర మతాలను గౌరవించాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మంగళవారం రాత్రి గణపవరం పెద్ద మసీదులో ముస్లింలు ఏర్పాటుచేసిన ఇఫ్తార్‌విందులో ఆయన పాల్గొన్నారు. టీటీడీ సభ్యుడు గాదిరాజు సుబ్బరాజు, ఎంపీపీ అర్ధవరం రాము, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దండు రాము, మసీదు గురువులు అర్మస్‌రాజా, చిన్న గురువు ఫారూఖ్, మసీదు అధ్యక్షుడు షేక్ ఖాదర్‌ఖాన్, ఎంపీటీసీ సభ్యుడు మహ్మద్‌జానీ, ఏఎంసీ వైస్ చైర్మన్ గాదిరాజు అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం వాసుబాబు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి సన్నిధిలో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న భక్తులు

పెదపాడు: మండలంలోని అప్పనవీడులో అభయాంజనేయస్వామి సన్నిధిలో మంగళవారం ఉగాదిని పురస్కరించుకుని అన్నదానం నిర్వహించారు. సుమారు 200 మందికి నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమాన్ని దాత హైదరాబాద్‌కు చెందిన బొరుసు వెదుళ్ల మెహర్‌కుమార్ లక్ష్మీ రామ లీలా శిరీషాదంపతులు నిర్వహించారు. తొలుత అభయాంజనేయస్వామి వారికి ఆలయ అర్చకులు రామా చార్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఏర్పాట్లను ఈఓ కూచిపూడి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

డాక్టర్ దుట్టాను కలిసిన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు



దుట్టా రామచంద్రరావుతో కొఠారు అబ్బయ్య చౌదరి, కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్

పెదపాడు/హనుమాన్ జంక్షన్ రూరల్: రానున్న ఎన్నికల్లో సహాయ సహకారాలు అందించాలని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌లు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు డాక్టరు దుట్టా రామచంద్రరావును కోరారు. సోమవారం రాత్రి హనుమాన్ జంక్షన్‌లోని డాక్టరు దుట్టా రామచంద్రరావు నివాసానికి వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఏలూరు జిల్లాలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై ముచ్చటించారు. దెందులూరు నియోజకవర్గంలోనూ, ఏలూరు పార్లమెంట్‌లో పరిస్థితులపై ఆరా తీశారు. ఎన్నికల్లో తనవంతు సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, దెందలూరు ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పెదవేగి : పెదపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కార్యాలయ పర్యవేక్షణాధికారి కె.జాన్సన్ తెలిపారు.

పేదల ఇళ్లకు ఉచిత వెలుగులు

- జగనన్న కాలనీల్లో 8000 విద్యుత్ కనెక్షన్ల ఏర్పాటు
- ఒక్కో లబ్ధిదారుడికి రూ.5 వేలు ఆదా



జాలిపూడి జగనన్న కాలనీ (ఫైల్)



ఏలూరు రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేసింది. వారు నివసించే ప్రాంతాల అభివృద్ధికి కూడా అధిక ప్రాధాన్యత ఇచ్చింది. జగనన్నకాలనీల్లో రోడ్లు, తాగునీరు, వీధిలైట్లు ఏర్పాటుతోపాటు పేదలు నిర్మించుకున్న ఎనిమిది వేల ఇళ్లకు రూ.4 కోట్లు వెచ్చించి ఉచిత విద్యుత్ కనెక్షన్లను అందించింది. ఫలితంగా ఒక్కో లబ్ధిదారుడు రూ.5 వేలు చొప్పున లబ్ధి పొందారు. ఇలా ఏలూరు నియోజకవర్గంలో స్థలాలు పొందిన 39 వేల మంది ఇళ్లు పూర్తిచేసుకుంటే, సుమారు రూ.19.50 కోట్లు లబ్ధి చేకూరనుంది.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ అధికారులు ఇంటి నిర్మాణం పూర్తి కాగానే నేరుగా లబ్ధిదారుడి వద్దకు వెళ్లి ఆధార్, ఇంటి స్థల పట్టా జిరాక్స్ తీసుకుని, మీటర్ మంజూరు కోసం వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేస్తున్నారు. వెంటనే ప్రభుత్వం విద్యుత్ కనెక్షన్ మంజూరు చేసుంది. 24 గంటల్లో లబ్ధిదారుడి ఇంటికి కనెక్షన్ ఇస్తున్నారు. దీనికి లబ్ధిదారుడు ఒక్కపైసా కూడా చెల్లించాల్సిన పని లేదు. ఏలూరు నియోజకవర్గంలోని లక్ష్మీపురం, పోణంగి, కొమడవోలుతో పాటు ఏలూరు రూరల్ గ్రామాలైన శ్రీపర్రు, మాదేపల్లి, చాటపర్రు, మల్కాపురం, జాలిపూడి, పైడిచింతపాడు జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకున్న పేదలందరికీ ఉచిత విద్యుత్ కనెక్షన్ అందించారు. సర్వీస్ వైర్, మీటర్, బోర్డు, ఎంసీబీ, ఎర్త్‌వైర్ బిగించారు. దీంతో ఒక్కో ఇంటికీ సుమారు రూ.5 వేల లబ్ధి చేకూరింది.

సబ్‌స్టేషన్ ఏర్పాటు

కాలనీల్లో విద్యుత్ సమస్య తలెత్తకుండా ప్రభుత్వం కొమడవోలు, పోణంగి, లక్ష్మీపురం, గుడివాకలంక గ్రామాల్లో రూ.4.50 కోట్లు చొప్పున ఖర్చు చేసి మూడు సబ్‌స్టేషన్లు, పదుల సంఖ్యలో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసింది. వందలాది విద్యుత్ స్తంభాలు పాతించింది. కాలనీలన్నింటికీ సుమారు 120 కిలో మీటర్ల మేర విద్యుత్ లైన్ ఏర్పాటుచేయించింది.



జగనన్న కాలనీలో ఓ ఇంటికి మీటర్ బిగిస్తున్న సిబ్బంది

సొంతింటి కల సాకారమైంది



జగనన్నకాలనీలో నా ఇంటికి అధికారులు ఉచితంగా కరెంట్ ఇచ్చారు. ఇల్లు పూర్తి కాగానే సిబ్బంది వచ్చి మీటర్ బిగించారు. ఒక్క పైసా కూడా తీసుకోలేదు. నాతో పాటు మా కాలనీలో ఇళ్లు కట్టుకున్న వారందరికీ ఉచితంగా మీటర్లు వచ్చాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నా సొంతింటి కల సాకారం చేశారు. స్థలం ఇచ్చారు. రుణం మంజూరు చేశారు. కుళాయి, వీధిలైట్లు, రోడ్లు వేశారు. సంతోషం ఉంది. – ఎం నాగేశ్వరమ్మ, శనివారపుపేట

నమ్మలేకపోతున్నాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వేలాది మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం మరచిపోలేని విషయం. పేదలు సంబరాలు చేసుకున్నారు. వందలాది మంది లబ్ధిదారులు ఇళ్లు కట్టుకున్నారు. నాకు తెలిసి రాష్ట్రంలో ఇల్లు లేని పేద వాడు ఉండడు. గతంలో ఇల్లు కావాలంటే ఏళ్ల తరబడి ఎదురుచూశాం. గత పాలకులు ఏళ్ల తరబడి చేయలేని పని. జగన్‌మోహన్ రెడ్డి ఐదేళ్లలో చేసి చూపించారు. – తంగెళ్ల రాము, కార్పొరేటర్, 15వ డివిజన్

శాస్త్రోక్తంగా ఉగాది ఉత్సవాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది ఉత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. జ్యోతి ప్రకాశనం, నటరాజ పూజతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. మైలవరపు లక్ష్మీనరసింహం ఉగాది పండుగ విశిష్టతపై ప్రవచనం, పంచాంగ పఠనం చేశారు. ఈ సందర్భంగా హిందూ యుజవన సంఘం అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు వారి సంస్కృతి, సాంప్రదాయాలు పెంపొందించే కార్యక్రమాలు హిందూ యువజన సంఘం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ మాట్లాడుతూ శ్రీ క్రోధి నామ సంవత్సరంలో అందరికీ మేలు చేకూరాలని, అందరూ సంతోషకరమైన జీవనాన్ని గడపాలని ముఖ్యంగా కళాకారులు, కళా సంస్థలు తేజోయమానంగా విరాజిల్లుతూ సమాజ కృషికి పాటుపడాలని అన్నారు. కార్యక్రమంలో హిందూ యుజవన సంఘం ఉపాధ్యక్షుడు ఇరదల ముద్దు కృష్ణ, సహాయ కార్యదర్శి వేమా కోటేశ్వరరావు, కార్యనిర్వాహక కమిటీ ఉపాధ్యక్షుడు బీవీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, సంకు సురేష్, ప్రధాన కార్యదర్శి మజ్జి సూర్యకాంతారావు, కేబీ రావు, ఎల్ వెంకటేశ్వరరావు, మోతే శ్రీనివాస నారాయణ రావు, లంక వెంకటేశ్వర్లు, ఎ.పార్వతీ రామచంద్రన్, దువ్వి హేమ సుందర్, ఎం.సూర్యనారాయణ యాదవ్, ఎంవీ రవీంద్ర, కె.హేమంత్ కుమార్, రేవూరి శివశంకర వరప్రసాద్, గుత్తా కౌశలేంద్రరావు,గరికపాటి కాళిదాసు, కె.సాంబశివరావు, యూబీవీ చలపతిరావు, జిల్లెళ్లమూడి వరప్రసాద రావు, టి.లోకేశ్వరరావు, కళాకారులు పాల్గొన్నారు.



వైఎంహెచ్‌ఏ హాలులో పంచాంగ పఠనం చేస్తున్న లక్ష్మీ నరసింహం



మజ్జి కాంతారావుకు ఉగాది పురస్కారం అందిస్తున్న అతిథులు

స్నేహమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

ఉగాది ఉత్సవాలను స్థానిక పవర్‌పేటలోని స్నేహమ్ సంస్థ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర మెడికల్ బోర్డు సభ్యుడు దిరిశాల వరప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో స్నేహపూరిత వాతావరణం నెలకొల్పడానికి ఆత్మీయత పెంచుకుందాం, ఆనందం పంచుకుందాం అనే నినాదంతో స్నేహమ్ అసోసియేషన్ దశాబ్దాల కాలంగా నగరంలో విశేష సేవలందించడం అభినందనీయమన్నారు. సంస్థ అధ్యక్షుడు అంబికా రాజా మాట్లాడుతూ తమ స్నేహమ్ సంస్థ నిర్వహించే సేవా కార్యక్రమాలకు స్నేహ హస్తం అందిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. దేశ వ్యాప్తంగా అనేక సంస్థల నుంచి పురస్కారాలు అందుకున్న నగరానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు మజ్జి సూర్య కాంతారావుకు స్నేహమ్ సంస్థ ద్వారా ఉగాది పురస్కారం అందించారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త అంబికా కృష్ణ, టికు బ్యాంక్ చైర్మన్ అంబికా ప్రసాద్, స్నేహమ్ సంస్థ సభ్యులు కేఎల్‌వీ నరసింహం, గురు శర్మ, పయిడేటి రఘు తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం

ఏలూరు రూరల్ : శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు మంగళవారం ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియం వాకర్స్ నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎం అక్బర్ ఆధ్వర్యంలో సిద్ధాంతి సత్యనారాయణ పంచాంగ శ్రవణం చేశారు. వాకర్స్ ప్రశ్నలకు వివరణ ఇచ్చారు. అసోసియేషన్ కార్యదర్శి నాగ విఘ్నేశ్వరరావు, కోశాధికారి విశ్వనాథ్ మాధవరావు, కర్రి అరుణ, మేరీ మాణిక్యం, రామ్, సత్యవతి తదితరులు పాల్గొన్నారు. పంచాంగ కర్తతో పాటు రిటైర్డ్ హెచ్ఎం జల్లా వీవరభద్రరావు, అసోసియేషన్ సలహాదారుడు సత్తార్‌ను సభ్యులు శాలువ కప్పి సన్మానించారు.

ఉత్సాహంగా ఇంటింటి ప్రచారం



గాలాయగూడెంలో అభివృద్ధిని వివరిస్తున్న నాయకులు



గణపవరంలో ప్రచారం చేస్తున్న చినబాబు



గుణపర్రులో ఓట్లు అభ్యర్థిస్తున్న కన్నబాబు

దెందులూరు: టీడీపీ ప్రభుత్వం హయాం, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వాల హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలందరూ బేరీజు వేసుకుని తమ విలువైన ఓటును వినియోగించుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు నిట్టా లీలా నవకాంతం గంగరాజు, పార్టీ దెందులూరు మండల అధ్యక్షులు కామిరెడ్డి నాని అన్నారు. మంగళవారం మేమంతా సిద్ధం కార్యక్రమాన్ని గాలాయగూడెం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి సీఎంవైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అమలు చేసిన అభివృద్ధిని వివరించారు. టీడీపీ హయాంలో చంద్రబాబు మోసపూరిత హామీలే తప్ప అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించారన్నారు. రెండు ఓట్లను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి విజయం చేకూర్చాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పరసా లక్ష్మీసుజాత కనకరాజు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్, సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), రాజు, రాజేష్, ఎంపీటీసీ సభ్యులుపుల వర్తి వరమణి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాగులదేవునిపాడులో

నాగులదేవునిపాడులో వైఎస్సార్ సీపీ నాయకులు మేమంతా సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలతో పాటు అమలు చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని వివరించారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలు మేలు కోరి అభివృద్ధి చేశారు కాబట్టే ఇంటింటికి వచ్చి ధైర్యంగా ఓటు అడుగుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబటి లక్ష్మణరావు, సొసైటీ చైర్మన్ తోట అచ్చియ్య, ఎంపీటీసీ సొంగా ప్రమీలారాణి వెంకటేశ్వరరావు, ముసునూరి వెంకటేశ్వరరావు, బోయపాటి గణేష్, పెద్దిశెట్టి బసవయ్య, వార్డు మెంబర్లు, రాజేష్, శ్రీధర్, తోట వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కూటమి వస్తే పేదలకు కష్టాలే

గణపవరం: అబద్ధాల టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే పేదలకు అన్నీ కష్టాలేనని వైఎస్సార్ సీపీ గణపవరం మండల బాధ్యుడు, ఎమ్మెల్యే వాసుబాబు సోదరుడు పుప్పాల చిన బాబు అన్నారు. వైఎస్సార్ సీపీ గెలుపు కోరుతూ మంగళవారం గణపవరం పట్టణంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చినబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ చూడని సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ప్రజలంతా అండగా నిలవాలని, మరోసారి జగన్‌ను ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత మనదేనని అన్నారు. నిజాయితీ పరుడైన ఎమ్మెల్యే వాసుబాబును మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఎస్సీ పేట, వడ్డి పేట, కులంబీపేట ప్రాంతాల్లో ఇంటింట ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం నుంచి లబ్ధి కలిగితే తప్పకుండా ఫ్యాన్‌గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ దండు రాము, పట్టణ కన్వీనర్ రొంగల శ్రీను, సర్పంచ్ మూర అలంకారం, ఎంపీటీసీ సభ్యులు, వైస్ ఎంపీపీ సలాది రత్నకుమారి, సొసైటీ అధ్యక్షుడు కొనిశెట్టి రమేష్, పార్టీ నాయకులు కాకర్ల శ్రీను, తెనాలి సునీల్, నన్నేటి మోహన్, అడపా త్రినాథ్, శెట్టి రాజా, మూర భాస్కరరావు, షాజహాన్, స్థానిక యువకులు పాల్గొన్నారు.

గుణపర్రులో వైఎస్సార్ సీపీ శ్రేణుల ప్రచారం

నిడమర్రు: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి జగనన్న సంక్షేమానికి మద్దతు తెలపాలంటూ ఎమ్మెల్యే సోదరుడు, మండల బాధ్యులు పుప్పాల కన్నబాబు కోరారు. మంగళవారం గుణపర్రు గ్రామంలో కన్నబాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. టీటీడీ బోర్డు సభ్యులు గాదిరాజు వెంకట సుబ్బరాజు, ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, సచివాలయాల మండల కన్వీనర్ నౌడు అచ్యుతరామారావు, సర్పంచ్ కూనపురాజు బుజ్జి, పార్టీ అధ్యక్షుడు గాది నాగేశ్వరరావు, ఎంపీటీసీ ముదునూరి త్రివేణి, గ్రామ పార్టీ బాధ్యుడు నిమ్మల బాబూరావు, సర్పంచ్‌లు పుప్పాల మెహర్‌కుమార్, బంగారమ్మ త్రిమూర్తిరాజు, మాజీ సర్పంచ్ రాయుడు రాంబాబు, పట్టపు ప్రసాదు, చోడగిరి హరికృష్ణ, తదితరులున్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	22
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.30	34
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	36
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	20

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	06
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	20
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	15
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	16
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	25
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	21
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	15
ఏలూరు –తిరుపతి	16.00	4830	29

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు ఈపీడీసీఎల్ సౌత్ సెక్షన్ పరిధిలోని వంగాయగూడెం, పోణంగి ఫీడర్ల ప్రాంతాల్లో చెట్ల కొమ్మల తొలగింపు, వార్షిక మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేపీబీ నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. పడమర వీధి, దొంగల మండపం, బ్రహ్మం గారి గుడి, చిరంజీవి బస్ స్టాప్, ఆముదాల అప్పల స్వామి కాలనీ, జలాపరమేశ్వర కాలనీ, దక్షిణపు వీధి, వెంకన్న చెరువు ప్రాంతం, తూర్పువీధి, కొత్తగూడెం ప్రాంతం, ఫిల్‌హౌస్ పేట, వీవర్స్ కాలనీ, చాటపర్రు రోడ్డు, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

జూట్ మిల్లు వెంటనే తెరిపించాలి

ఏలూరు (టూటౌన్): కొత్తూరు జూట్ మిల్లును వెంటనే తెరిపించాలని, సుమారు రెండు వేల కార్మికుల కుటుంబాలను పడేయవద్దని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి కోరారు. స్థానిక పవరుపేటలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

కార్మికులకు అన్యాయం

కొత్తూరు జూట్ మిల్లును మూసివేయడం కార్మికులకు తీవ్ర అన్యాయం చేయడమేనని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా సమితి అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస డాంగే, ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

దివ్యాంగులకు వితరణ

భీమడోలు: గుండుగొలను గ్రామంలో శ్రీవిఘ్నేశ్వర దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం 60 మంది దివ్యాంగులకు సాయం అందించారు. గ్రామానికి చెందిన రిటైర్డ్ వగ్వాల హరిమాధవరావు, సూర్యకుమారి దంపతులు ఆర్థిక సాయంతో బియ్యం, పండ్లు, పోషకాహారం, బిర్యానీ ప్యాకెట్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. శ్రీవిద్యాలయ టీచర్ సేవా సమితికి రూ.10 వేల విరాళం అందించారు. దాతల వితరణను పలువురు అభినందించారు. అనంతరం దాతలు, ఏలూరుకు చెందిన బియ్యం వ్యాపారి మద్ది మల్లికార్జునరావులను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పేరిచర్ల శ్యామలరాజు, గేదెల శ్రీనివాస రావు, అరసంకల సోములు, రావి గంగరాజు సేవా సమితి సభ్యులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కండిగలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

ద్వారకాతిరుమల: గుండుగొలనుకుంటలో చిలుకూరి ధర్మారావు తోటలో కొలువైన శ్రీ కండిగలమ్మ, పోతురాజు స్వామివార్ల ఆలయంలో అమ్మవారి ఉత్సవ మూర్తిని మంగళవారం ప్రతిష్ఠించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, పురోహితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ ఘనంగా జరిగిన ఈ వేడుక భక్తులకు నేత్రపర్వమైంది. కాగా రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత ఈ ఆలయాన్ని రాత్రి సందర్శించారు. ముందుగా ఆలయానికి విచ్చేసిన ఆమెకు ధర్మారావు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పసుపు, కుంకుమలను సమర్పించారు. ఈ వేడుకలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, ఎంపీపీ బొండాడ మోహిని, వెంకన్నబాబు దంపతులు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, సర్పంచ్ బండారు ధనలక్ష్మి, అచ్యుత ఏసుబాబు దంపతులు, తేలు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీవసంత నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం



సీతారామ లక్ష్మణుల బంగారు విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

గణపవరం: గణపవరం మండలం సరిపల్లె సఖ్యాభివర్ధక నిలయంలోని టీటీడీ కల్యాణ మండపంలో 104వ శ్రీవసంత నవరాత్రి మహోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు ఈనెల 17న శ్రీరామనవమి పర్వదినం వర కు కొనసాగుతాయి. సరిపల్లె గాయత్రి బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో గత 104 సంవత్సరాల నుంచి ఏటా ఉగాది రోజున వసంత నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం శ్రీసీతా, రామ, లక్ష్మణ, ఆంజనేయస్వాముల బంగారు విగ్రహాలను రామాలయం నుంచి ఊరేగింపుగా తీసుకువచ్చి కల్యాణవేదికపై పూజలు చేశారు. తొలిరోజు ఆరుగురు దంపతులు పీటలపై కూర్చుని పూజలు నిర్వహించారు. వీరికి బ్రాహ్మణ సేవాసంఘం పూజా సామగ్రి ఉచితంగా అందజేశారు. అనంతరం ఏర్పాటుచేసిన అన్నసమారాధన కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ ఆధ్యాత్మికవేత్త సాగిరాజు సుబ్బరాజు, హోమియో వైద్యుడు శర్మ ఆర్థిక సాయం అందించా రని బ్రాహ్మణ సేవాసంఘం ప్రతినిధులుతెలిపారు. 15వతేదీ సోమవారం శ్రీరామపట్టాభిషేకం, 16న సీతమ్మవారి జన్మదినోత్సవం, 17న శ్రీరామచంద్రు ని జన్మదినం, సీతారామచంద్ర కల్యాణంతో కార్యక్రమాలు ముగుస్తాయని సంఘసభ్యులు క్రొవ్విడి సూర్యనారాయణ, కాళ్లకూరి సత్యనారాయణమూర్తి, కె.సుబ్బరాజు, కె.విశారద పేర్కొన్నారు.